క్లుప్తంగా

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో గురువారం 177వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి. కృష్ణవేణి, సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిశోర్, సలహాదారు నేతి విశ్వేశ్వరరావు పాల్గొని, జ్యోతి ప్రకాశనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ పలువురి సమష్టి కృషితో 45 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ సంగీత సభ సంగీతాభిమానులకు వరమని పేర్కొన్నారు. ఎన్ని చదువులు చదివినా, ఎంత ఉన్నత పదవులు పొందినా సంగీతంతో కలిగే ఆనందం అనిర్వచనీయమని తెలిపారు. అనంతరం అతిథులు సావెనీర్‌ను ఆవిష్కరించారు. త్యాగరాజస్వామి కీర్తనల లఘు కచేరీలు సంగీతాభిమానుల్ని అలరించాయి. సాయంత్రం ప్రధాన కచేరీలో భాగంగా చెన్నైకు చెందిన ఏ.ఎస్.మురళి గాత్ర కచేరీ శ్రావ్యంగా సాగింది. అతిథులను, కళాకారులను ఉపాధ్యక్షులు ఎస్. గిరిజాశంకర్, కార్యవర్గం ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ

నెహ్రూనగర్: పాత గుంటూరు క్రిస్టియన్ పేట సచివాలయం- 2 పరిధిలో గురువారం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, వలంటీర్ హైమావతి, ఆశా వర్కర్ స్వర్ణలత పాల్గొన్నారు. రూ.5లక్షల పరిమితిగా ఉన్న ఆరోగ్యశ్రీ కార్డును రూ.25లక్షల వరకు పెంచుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యం



గుంటూరు మెడికల్: బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను గురువారం శ్యామలానగర్ బంజారా నాయక్ కాలనీలో ప్రారంభించారు. యాత్ర పట్టాభిపురం, కృష్ణ నగర్, దేవాపురం మీదుగా అశోక నగర్ వినాయకుడి దేవస్థానం వద్ద ముగిసింది. ముఖ్య అతిథులుగా బీజేపీ సీనియర్ నాయకులు కిలారు దిలీప్, కె.వి. సుబ్బారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ విజయ సంకల్పయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలకు స్పందన

నెహ్రూనగర్: సమర్థనం ట్రస్ట్, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని సమర్థనం ట్రస్ట్ కార్యాలయంలో 'దేశాభివృద్ధిలో మహిళల పాత్ర' అనే అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రచయితల సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచే అన్ని రంగాల్లో నైపుణ్యత పెంపొందించుకోవాలని సూచించారు. వక్తృత్వ పోటీలకు గ్రూప్స్‌కి సన్నద్ధమయ్యే విద్యార్థినులు హాజరు కావడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ధాత్రి, సమర్థనం ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.వి.రమణి, ట్రస్ట్ ఏపీ చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు పరమహంస, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పరారైన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. చైతన్యపురి కాలనీ 2వ లైనులో నెల్లూరు ప్రమీల నడుచుకుంటూ వెళుతుండగా, ఓ వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. ప్రమీల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

ఇద్దరు వ్యక్తులు కలిసి మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టుగుంట సెంటర్‌లో షేక్ ఖాసీం సైదులుపై పాతకక్షల నేపథ్యంలో షేక్ నాగూర్, పీర్‌మస్తాన్ దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి, చండీ హోమాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో పుష్య పౌర్ణమి సందర్భంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలను రుత్వికులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిలో ఆలయ పాలకమండలి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న పక్షవాతం ముప్పు

గుంటూరు బ్రాడీపేటకు చెందిన రమేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిమిత్తం బెంగుళూరులో ఉంటున్నాడు. స్మోకింగ్ అలవాటుగా మారింది. వృత్తిపరమైన ఒత్తిడితో నిత్యం బిజీగా ఉండే అతను ఇటీవల సంక్రాంతి సెలవులు కోసం ఇంటికి వచ్చాడు. రాత్రి పూట నిద్రిస్తున్న సమయంలో రమేష్‌కు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఇంట్లో వారు దాన్ని గుర్తించక పరిస్థితి విషమించడంతో పండగ సమయంలో ఆనందంగా ఉండాల్సిన ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నేడు ఉద్యోగస్థులే కాకుండా రోజువారీ కూలీలు, యువత కూడా బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు.

- యుక్తవయస్సులోనూ బ్రెయిన్ స్ట్రోక్స్
- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న బాధితులు
- అప్రమత్తతతో 80శాతం నివారణ
- అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



జీజీహెచ్ స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న స్ట్రోక్ బాధితులు(ఫైల్)

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా నేడు యువకుల్లో బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు సంభవించటంపై వైద్య నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్షవాతాన్ని నూటికి 80శాతం నివారించవచ్చని, అవగాహన లేకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

మెదడుకి వెళ్లే రక్తనాళం గానీ, మెదడులోని రక్తనాళం గాని పూడుకుపోవటం వల్ల సరఫరా ఆగిపోతే పక్షవాతం బ్రెయిన్ స్ట్రోకు వస్తుంది. హార్ట్ ఎటాక్ లాగే ఇది చాలా ప్రమాదకరం. ఇది రావడానికి ప్రధాన కారణం రక్తపోటు(బీపీ) పెరగడం. పొగతాగడం, మద్యపానంతో రక్తనాళాలు దెబ్బతిని చిట్లిపోయి కూడా పక్షవాతం వస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం, మెదడులో కణుతులు, రక్తంలో కొవ్వు పదార్థాలు, మెదడువాపు వ్యాధులు, గుండె జబ్బుల సమస్యలతో పాటు స్థూలకాయుల్లోనూ, 70 ఏళ్లు దాటిన వారిలో వ్యాధి వస్తుంది.



జీజీహెచ్‌లోని స్ట్రోక్ యూనిట్

బాధితులు అధికమే....

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 10 మంది వరకు పక్షవాతానికి గురైన వారు వైద్యం కోసం వస్తున్నారు. జిల్లాలో 30 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు మూడు నుంచి ఐదుగురు పక్షవాతానికి గురైన వారు చికిత్స కోసం వస్తున్నారు. 20 నుంచి 36 ఏళ్లలోపు వారు సైతం నేడు పక్షవాతానికి గురవ్వటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు నిలవరించవచ్చని సూచిస్తున్నారు.

లక్షణాలు

- పక్షవాతం వచ్చిన వారికి ఒకే వస్తువు రెండుగా కనబడుతుంది
- మాట తడబడి, అయోమయంగా మాట్లాడతారు
- మింగుడు పడకపోవటం, నీరు సరిగా తాగలేకపోతారు
- కళ్లు,తల తిరగటం,
- ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి,వాంతులు
- నడకలో తూలుడు, మూతి ఒకవైపుకు ఒంకరపోవడం
- దృష్టి మందగించడం
- కాళ్లు, చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- కొన్ని సందర్భాల్లో రోగి కోమాలోకి వెళ్తాడు.

తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు ఇవి..

పక్షవాతం వచ్చిన వెంటనే రెండు మూడు గంటల వ్యవధిలోనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. రక్తపోటును, షుగర్‌ను అదుపులో పెట్టుకోవాలి. మద్యపానం, ధూమపానం చేయకూడదు. కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినకూడదు. స్థూలకాయం లేకుండా చూసుకోవటంతోపాటుగా ప్రతిరోజూ వ్యాయామం చేయడం మంచిది.

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నాం. పది పడకలతో రూ.50లక్షలతో నిర్మించిన ఆధునిక స్ట్రోక్ యూనిట్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా పక్షవాత బాధితులకు వైద్యసేవలను అందిస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్ట్రోక్ యూనిట్‌ను కల్గి ఉన్న ఏకైక ఆస్పత్రి గుంటూరు జీజీహెచ్ మాత్రమే. స్ట్రోక్ బాధితులకు తక్షణమే చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నాం. పీజీ వైద్యులు క్యాజువాలిటీలో నిత్యం అందుబాటులో ఉండి బాధితులను తక్షణమే స్ట్రోక్ యూనిట్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

– డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ విభాగాధిపతి

20శాతం కేసులకు ఆపరేషన్లు తప్పనిసరి



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో నూటికి 80శాతం మందికి మెడికల్ మేనేజ్‌మెంట్ ద్వారా పక్షవాతం తగ్గిపోతుంది. బ్రెయిన్‌లో రక్తపుగడ్డ పెద్ద సైజులో ఉన్నప్పుడు 20శాతం కేసులకు తప్పనిసరిగా ఆపరేషన్ చేస్తేనే రోగి బ్రతికే అవకాశాలు ఉన్నాయి. బాధితుడిని గోల్డెన్ అవర్‌లో న్యూరోసర్జన్ వైద్యుడి తీసుకెళ్తే సకాలంలో ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడతారు. ఆధునిక వైద్య సేవలు నేడు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

గోల్డెన్ అవర్‌లో తరలించాలి



స్ట్రోక్ వచ్చిన మూడు గంటల్లోపు రోగిని స్ట్రోక్ యూనిట్‌కు తీసుకు రావడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు. ఈ కాలాన్ని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు. సకాలంలో పక్షవాతం వచ్చిన వారికి వైద్యం అందించని పక్షంలో శాశ్వతంగా అంగవైకల్యం ఏర్పడుతుంది. గతంలో 50 ఏళ్ల వయస్సు దాటిన వారిలో పక్షవాతం ఎక్కువగా వచ్చేది. నేడు 30 ఏళ్లలోపు వారు స్ట్రోక్‌కు గురవుతున్నారు. న్యూరాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చికిత్స పద్ధతులపై వైద్యులకు సైతం నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు(సీఎంఈ) నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తానని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఆమె గురువారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా ఆదేశాల మేరకు 53వ డివిజన్‌లో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి వాటిని తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఇతర మౌలిక వసతులు కల్పించి ప్రజలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటున్నామని తెలిపారు. సమస్యల్ని నేరుగా తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు సాల్మన్, పూనూరి నాగేశ్వరరావు, నంబూరి మహేష్, జంగం దాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం అని సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని ఆర్టీసీ కాలనీ, ఐపీడీ కాలనీల్లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రోగుల వివరాలు అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ఏకైక సీఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, రామనబోయిన అజయ్‌యాదవ్, ఫర్జానా, వైఎస్సార్ సీపీ నేతలు ఎం. సుధాకర్‌రెడ్డి, మురళి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నూరిఫాతిమా

ప్రజాస్వామ్య మనుగడకు ఓటుహక్కు కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు



ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్ఎం, సిబ్బంది

నగరంపాలెం: ప్రజాస్వామ్య మనుగడకు ఓటుహక్కు కీలకమని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో వినియోగించుకోవాలని జిల్లా ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు తెలిపారు. జాతీయ ఓటు హక్కు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు ఎన్నికల్లో ఓటు వేయాలని చెప్పారు. ఓటర్లకు సాధికారిత, జాగురూకత, భద్రత కల్పిస్తూ, సమాచారాన్ని అందించడమే ఓటరు దినోత్సవ ప్రధాన లక్ష్యమని వివరించారు. కుటుంబ సభ్యులకు, స్నేహితులు, స్థానికులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్ కృష్ణన్, రాఘవయ్య, బ్రహ్మానందం పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం

లక్ష్మీపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోవడం శుభసూచికమని గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఓటుపై అవగాహన కల్పించి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రధానంగా యువ ఓటర్లకు పూర్తిస్థాయిలో ఓటు హక్కు విలువను వివరించాలని తెలిపారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



సీనియర్ ఓటర్లు, జోగారావు, సాంబయ్యలకు సత్కారం

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

గుంటూరు మెడికల్: ఓటు విలువను గుర్తించి సక్రమంగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ తాతా సేవ కుమార్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బ్రాడీపేటలోని పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన ఓటరు చైతన్య సభలో ఆయన ప్రసంగించారు. ఆప్ సీనియర్ నాయకుడు కందిమళ్ల శివప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సత్కారం

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లు జోగారావు, సాంబయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ మరమ్మతులకు అధిక ప్రాధాన్యం

నగర కమిషనర్ కీర్తి చేకూరి

పట్నంబజారు: వేసవి సమీపిస్తున్న తరుణంలో నగరంలోని తాగునీటి ప్రధాన పైపులైన్ల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు.పైపులైన్లను పూర్తిస్థాయిలో బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని రిజర్వాయర్ వద్ద జరుగుతున్న పైప్‌లైన్ లీకుల మరమ్మతుల పనుల్ని గురువారం ఆమె పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిలో నగరంలో తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. పనులకు ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్ దగ్గర పంపింగ్ పైప్ లైన్‌పై పలుమార్లు లీకులు ఏర్పడి తాగునీరు వృథా అవుతోందన్నారు. ప్రధానమైన పొన్నూరు రోడ్డుపై రాకపోకలకు సమస్యగా ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని చెప్పారు. పనుల్ని గురువారం సాయంత్రానికి పూర్తి చేసి శుక్రవారం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి

క్రికెట్‌కు 'మొహమాటం' సేవలు వెలకట్టలేనివి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు మొహమాటం వెంకటేశ్వరరావు సేవలు వెలకట్టలేనివని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి తెలిపారు. మొహమాటం ద్వితీయ వర్ధంతిని గురువారం అరండల్‌పేటలోని పిచ్చుకలగుంట క్రీడా మైదానంలో నిర్వహించారు. రమణమూర్తి మాట్లాడుతూ జిల్లా క్రికెట్ సంఘానికి మొహమాటం వెంకటేశ్వరరావు 24 ఏళ్ల పాటు కార్యదర్శిగా సేవలందించి అభివృద్ధి చేశారని తెలిపారు. ఆయన హయాంలో ఎం.ఎస్.కె. ప్రసాద్ లాంటి ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించారని పేర్కొన్నారు. రంజీ జట్టులో అరడజను క్రికెటర్లు జిల్లా వాసులే ఉండేవారని చెప్పారు. ఎందరో పేద క్రికెటర్లకు సాయం చేసి నిలబెట్టిన మొహమాటం లేకపోవడం తీవ్రమైన లోటని తెలిపారు. ఆయన చిత్రపటానికి రమణమూర్తితో పాటు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి దాసరి రమేష్ కుమార్, మాజీ క్రికెటర్లు సరస్వతీరెడ్డి, శరత్, ఇండ్ల భాస్కర్, రామకృష్ణ పరమహంస తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మొహమాటం వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమణమూర్తి

జీవ వైవిధ్య పరిరక్షణకు బయోడైవర్సిటీ బోర్డు కృషి

ఏఎన్‌యూ: జీవ వైవిధ్య పరిరక్షణకు బయోడైవర్సిటీ బోర్డు కృషి చేస్తోందని చైర్మన్ డాక్టర్ బండి మరియకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన పలువురు శాస్త్రవేత్తలతో కలిసి గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా బి.ఎం.కె.రెడ్డి యూనివర్సిటీలోని బోటనీ, మైక్రోబయాలజీ విభాగంలో విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మరియకుమార్‌రెడ్డి బయో డైవర్సిటీ చట్టం- 2002 ఆవశ్యకత, ఏపీలో బయోడైవర్సిటీ బోర్డు చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ మల్లికార్జున మాట్లాడుతూ ఈ ఏడాది ఎంఎస్సీ ఫారెస్ట్రీ కోర్సును ప్రారంభించామన్నారు. పరిశోధకులు డాక్టర్ కళ్యాణి బాయ్, రీజినల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ చెన్నకేశవ నాయక్, గ్రీన్ ఫండ్ ఆఫీసర్ బి. వెంకటేశ్వర్లు, విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో మార్చి 6, 7 తేదీలలో నేషనల్ వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మజీరావు తెలిపారు. వర్క్‌షాప్ బ్రోచర్‌ను వీసీ గురువారం ఆవిష్కరించారు. సదస్సు డైరెక్టర్ మాట్లాడుతూ 'అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మెథడాలజీ' అనే అంశంపై వర్క్ షాపు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్క్ షాప్ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం. వసంతరావు మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీన్ ప్రొఫెసర్ టి. స్వరూపరాణి, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ టి. సందీప్, డాక్టర్ ఆర్. శివరామిరెడ్డి పాల్గొన్నారు.

పలు ప్రాంతాలను సందర్శించిన టూరిజం విద్యార్థులు

జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు కొండపల్లి ఖిల్లాను సందర్శించారు. కొండపల్లి బొమ్మలను తయారు చేసే కళాకారులతో సంభాషించారు. అనంతరం విజయవాడ స్వరాజ్ మైదానంలో భారతరత్న అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణాన్ని విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

తుమ్మల చెరువు రైల్వే గేటు మూసివేత

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని తుమ్మల చెరువు గ్రామ పరిధిలో అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు గేటును మూసి వేస్తున్నట్లు డీసీఎం ప్రదీప్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అటువైపు వెళ్లే ప్రయాణికులకు అంతరాయం ఏర్పడకుండా ఆర్‌యూబీ వైపు దారి మళ్లించినట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య ఉద్యోగుల సంఘ నేత కోటేశ్వరరావుకు నివాళి

నెహ్రూనగర్: పారిశుద్ధ్య కార్మికుల(కాంట్రాక్ట్) సమస్యల పరిష్కారంలో వరికల్లు కోటేశ్వరరావు సేవలు ప్రశంసనీయమని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య పనివారాల సంఘం, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల మరియన్న పేర్కొన్నారు. కోటేశ్వరరావు 19వ వర్ధంతిని పురస్కరించుకుని సుద్దపల్లి డొంకలో ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులకు వృత్తిపరంగా ఏ సమస్య వచ్చినా తానున్నానంటూ వారి పక్షాన నిలబడి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకునే వారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరికల్లు రవికుమార్, భూపతి నాంచారయ్య, రౌతు శివయ్య, అనురాధ, చంద్రశేఖర్, కృష్ణా, శ్రీను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు టీ షర్ట్‌ల పంపిణీ

గుంటూరు మెడికల్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు గురువారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. తొలుత ఆయన టీ షర్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలింతలు క్షేమంగా ఇంటికి చేరాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఏసీ వాహనాలను తీసుకుని వచ్చారని తెలిపారు. డ్రైవర్లు టీషర్ట్‌లు ధరించి విధులకు హాజరుకావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

ఐటీ రంగంలో సమూల మార్పులతో ఉజ్వల భవిష్యత్తు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐటీ రంగంలో చోటు చేసుకుంటున్న సమూల మార్పులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుంటూరు చలమయ్య-కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో ప్రోగ్రామింగ్ పైథాన్‌పై రెండు నెలలు పాటు శిక్షణ పొందిన బీకాం తృతీయ సంవత్సర విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులతో ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. కళాశాల కార్యదర్శి కర్నూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో చోటు చేసుకుంటున్న మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఐటీ రంగం ప్రపంచాన్ని శాసిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, శిక్షకులు శ్రీనివాస్, అవేష్ గోపాల్, కళాశాల కోశాధికారి జయప్రకాష్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ సుభద్ర, హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య స్కీంపై సమావేశం ఏర్పాటు చేయాలి

గుంటూరు వెస్ట్: జిల్లాస్థాయిలో ఉద్యోగుల ఆరోగ్య స్కీంపై సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేశారు. చాంద్ బాషా మాట్లాడుతూ సమావేశం ఏర్పాటు చేస్తే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఈహెచ్ఎస్ రాయితీలు, నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఉద్యోగుల ఇబ్బందులు తదితర అంశాల్ని చర్చించే వీలుంటుందని తెలిపారు. డీఆర్వో సానుకూలంగా స్పందించారు.